నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ బుధవారం 25 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

రెచ్చిపోతున్న చైన్ స్నాచర్స్

మహిళ మెడలో నుంచి గొలుసు అపహరణ

సీసీ పుటేజీలో కనబడుతున్న దుండగులు

భైంసా, సెప్టెంబర్ 24 : భైంసా పట్టణంలో చైన్ స్నాచర్స్ రెచ్చిపోతున్నారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు నడుచుకుంటూ వెళ్తున్న రాజీవ్‌నగర్‌కు చెందిన మంజుల మెడలో నుంచి మంగళవారం విశ్రాంతి భవనం వద్ద రెండున్నర తులాల బంగారు గొలుసును అపహరించుకుపోయారు. గొలుసు లాక్కునే క్రమంలో మహిళ కింద పడడంతో గాయాలయ్యాయి. అలాగే దుండగులు రాహుల్‌నగర్‌లోని ఓ కిరాణ దుకాణం వద్ద బైక్ నిలిపి రూ.500 నోటు ఇచ్చి సిగరేట్ అడిగారు. చిల్లర లేవని చెప్పడంతో ఐదు సిగరేట్‌లు ఇవ్వమన్నారు. దుకాణ యజమానురాలు కృష్ణవేణి చిల్లర ఇస్తున్న క్రమంలో ఆమె మెడలో నుంచి గొలుసులాగేందుకు ప్రయత్నించారు. ఆమె అప్రమత్తం కావడంతో వారు పరారయ్యారు.

కుష్టు నివారణకు కృషి చేయాలి

పీహెచ్‌సీని సందర్శించిన బృందం సభ్యులు

ఇచ్చోడ, సెప్టెంబర్ 24 : కుష్టు వ్యాధి రహిత సమాజానికి వైద్య సిబ్బందితోపాటు ప్రతి ఒక్కరు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సర్సాపూర్(టీ) పీహెచ్‌సీని బృందం సభ్యులు సందర్శించి, కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సభ్యులు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు మాట్లాడుతూ.. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి ఎండీటీ మందులు వాడితే పూర్తిగా తగ్గుతుందని, అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. పీహెచ్‌సీ రికార్డులు, రిపోర్టులను పరివీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవోలు వెంకటేశ్వరచారి, శ్రీనివాస్, జిల్లా అధికారులు గజానన్, మధుసూదన్ రావ్, రమేశ్, వామన్‌రావ్, పీహెచ్‌సీ డాక్టర్ హిమబిందు, గణేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మాకు టీచర్ కావాలి..

ఎమ్మెల్యేతో విద్యార్థుల మొర

తాంసి, సెప్టెంబర్ 24 : పొన్నారి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు టీచర్లు కావాలని ఎమ్మెల్యేతో మొర పెట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఉపాధ్యాయుల నియామకానికి కృషి చేస్తానన్నారు. ముందుగా ఇటీవల అనారోగ్యంతో వసంత్ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకులు అక్షయ్‌కుమార్, మొట్టె కిరణ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ, రవికాంత్ యాదవ్, అండె ఆనంద్, వినోద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు ఖాళీ

● వ్యవసాయశాఖలో భర్తీ కాని పోస్టులు ● ఎనిమిది మండలాల్లో ఏవోలు లేరు..
● డీఏవో, ముగ్గురు ఏడీఏలు లేరు.. ● ఖాళీల భర్తీపై దృష్టిసారించని సర్కారు

ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం

ఆదిలాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా రైతులకు వ్యవసాయశాఖ సేవలు అందని ద్రాక్షగా మారుతున్నాయి. జిల్లాలో 18 మండలాలు ఉండగా.. ఎనిమిది మండలాల్లోని వ్యవసాయశాఖ అధికారులు(ఏవో), మూడు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(ఏడీఏ), జిల్లా వ్యవసాయశాఖ అధికారులు లేరు. దీంతో సాగులో రైతులకు సలహాలు, సూచనలు అందజేయడంతోపాటు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలపై నిఘా కొరవడడంతోపాటు బయో మందుల విక్రయాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. వానకాలంలో రైతులు 5.25 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. ఇందులో అధికంగా పత్తి 3.80 లక్షలు, సోయాబిన్ 71 వేలు, కంది 60 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటలను రైతులు నష్టపోకుండా చూడాలి. అన్నదాతలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు తెగుళ్లు, పురుగుల నివారణకు కోసం ఏమి చేయాలనే విషయంలో సలహాలు, సూచనలు ఇవ్వాలి. వానకాలంలో పంటలు అధికంగా సాగవుతాయి. ఈ సమయంలో వ్యవసాయ శాఖలో కీలక పోస్టులు ఖాళీగా ఉండడం రైతులకు శాపంగా మారింది.

ఎనిమిది మండలాల్లో ఏవోలు లేరు..

జిల్లాలో 102 వ్యవసాయ శాఖ క్లస్టర్స్ ఉన్నాయి. మండల వ్యవసాయశాఖ కార్యాలయాల్లో ఎంఏవోలు అందుబాటులో ఉంటూ సాగు పర్యవేక్షణ, రైతుల సమస్యలను పరిష్కరించాలి. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఇటీవల బదిలీ కాగా ఆ స్థానంలో వచ్చిన అధికారి వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయంలో అన్‌డ్యూటీలో ఉన్నారు. ప్రస్తుతం ఇచ్చోడ ఏడీఏ శ్రీధర్ స్వామి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలోని ఏడీఏతోపాటు ఎస్టీఎల్, ఫార్మర్స్ ట్రెయినింగ్ సెంటర్ ఏడీఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితోపాటు ఎనిమిది మండలాల్లో(జైనథ్, బేల, సిరికొండ, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ, గాదిగూడ, నార్నూర్) వ్యవసాయ శాఖ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల ఏడీఏలతోపాటు ఏవోలు ఇతర జిల్లాలకు బదిలీ కాగా వారి స్థానంలో ప్రభుత్వం ఎవరిని నియమించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం వారి సమస్యల పరిష్కారానికి రైతు వేదికలను నిర్మించింది. అధికారులు, సిబ్బంది రైతులకు వీటిల్లో అందుబాటులో ఉండి సేవలు అందించాలి. అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీల ఫలితంగా సీజన్‌లో సేవలు అందడం లేదు.

యథేచ్ఛగా బయో మందుల విక్రయాలు

ప్రస్తుతం పత్తి, కంది పంటలు మంచి ఎదుగుదల దశలో ఉన్నాయి. బేల మండలంలోని కొందరు దళారులు దిగుబడుల పేరిట యథేచ్ఛగా బయో మందులను విక్రయిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి నిషేధిత మందులను తీసుకొచ్చి రైతులకు బలవంతంగా అంటగడుతున్నారు. ప్రస్తుతం పంటలకు బయో మందులు వాడితే బాగా పెరగడమే కాకుండా ఎక్కువ దిగుబడులు వస్తాయని నమ్మబలుకుతూ వేలాది రూపాయలకు నిషేధిత మందులను గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని కొందరు వ్యాపారులతో కలిసి ఈ దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తున్నది. బేల మండలంలో వ్యవసాయశాఖ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. దీంతో బయో మందుల విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

బయో మందుల విక్రయాలను నివారించాలి..

బేల మండలంలో వ్యవసాయాధికారి లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీజన్ కావడంతో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేవారు లేరు. దళారులు రైతులను మభ్యపెట్టి బయో మందులను అమ్ముతున్నారు. అమాయక రైతులు మభ్యపెట్టి లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు రెగ్యూలర్ వ్యవసాయాధికారిని నియమించి రైతులకు సేవలు అందేలా చూడాలి. - గోరే విశాల్, రైతు, బేల

విద్యార్థినులతో కలిసి మిషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

విద్యార్థినులు ధైర్యంగా ఉండాలి

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : విద్యార్థినులు కౌమారదశలో ఇబ్బందులకు గురికాకుండా ధైర్యంగా, ఆరోగ్యంగా ఉండడానికి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం బంగారిగూడలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఏర్పాటు చేసిన ప్రాజెక్టు డిగ్నిటీ హైజిన్ శానిటరీ ప్యాడ్స్ మిషన్‌ను విద్యార్థినులతో కలిసి కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. జిల్లాలోని 18 కేజీబీవీలలో చదువుతున్న విద్యార్థినులకు లెర్నింగ్ కరవ్, భారత్ పెట్రోలియం కెమికల్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా, ఏడాదికి సరిపడా శానిటరీ ప్యాడ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాజర్షి షా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులకు ఆరోగ్య రక్షణ పద్ధతులను చేపట్టడం ద్వారా విజయానికి ఎలా చేరవచ్చో వివరించారు. డిగ్నిటీ హైజిన్ శానిటరీ ప్యాడ్స్ మిషన్ ఉపయోగాలు తెలిపారు. ఇబ్బంది లేకుండా, పర్యావరణాన్ని కాపాడుకుంటూ పరిశుభ్రత పద్ధతులను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ప్రణీత, కేజీబీవీల సంయుక్త అధికారి ఉదయశ్రీ, లెర్నింగ్ కరవ్ సంస్థ అధికారిణి స్వప్న, బీపీసీఎల్ డీలర్ మోనిష్‌రెడ్డి, సేల్స్ ఆఫీసర్ నాగరాజు, కేజీబీవీ ఎస్‌వోలు జాదవ్ కవిత, దీప్తి, సువర్ణ పాల్గొన్నారు.

హాజరైన గ్రామస్తులు, అధికారులు

ఇబ్బందులు కలుగకుండా చూస్తాం

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 24 : ఇథనాల్ పరిశ్రమ వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిలావర్‌పూర్ మండల రైతులు, గ్రామస్తులు, ఇథనాల్ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల అనుమానాలకు అధికారులు పరిశ్రమ ప్రతినిధుల నుంచి సమాధానాలు తెలుసుకున్నారు. రైతుల ప్రశ్నలపై శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గొదాంను మంగళవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలెక్టర్ అభిలాష అభినవ్ కలిసి వివిధ రాజకీయ నాయకుల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, గంధ్రత్ రమేశ్, నరేశ్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

బాసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న హిందూ బంధువులు

బాసర, సెప్టెంబరు 24 : టీటీడీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగి నటువంటి లడ్డు అపవిత్ర కారకులపై నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బాసర హిందూ బంధువులు డిమాండ్ చేశారు. మంగళవారం సమావేశం ఏర్పాటు చేసుకుని మాట్లాడుకున్నారు. దీనిపై ప్రభుత్వం పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గత పాలకులు తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో లడ్డు అపవిత్రం అయిందని, ఆలయ ప్రతిష్టతను దెబ్బతీసే ప్రయత్నం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రావు, మారుతిజాదవ్, పుట్నాల సాయినాథ్ పాల్గొన్నారు. అనంతరం దీనిపై బాసర పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తీగలాగితే కదులుతున్న డొంక

● బిట్‌కాయిన్ దందాలో వెలుగులోకి వస్తున్న సూత్రదారులు ● పోలీసుల అదుపులో ఎనిమిది మంది 'స్టార్' నిర్వాహకులు?
● మరింత మందిని అదుపులోకి తీసుకునే అవకాశం

నిర్మల్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో 25 రోజుల క్రితం వెలుగు చూసిన యూ-బిట్ కాయిన్ ఆన్‌లైన్ దందా వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. 'తీగలాగితే డొంక కదులుతున్న' చందంగా ఈ వ్యవహారంలో రోజుకు కొంతమంది వెలుగులోకి వస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. యేడాది కాలంగా సాగుతున్న దందాలో వేలాది మంది లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. ఈ దందాకు సూత్రదారులుగా కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు వ్యవహరించడం మొదట్లోనే చర్చనీయాంశమైంది. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉండడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ పేరిట డాలర్ల రూపంలో ఈ బిట్‌కాయిన్ దందా కేవలం సెల్‌ఫోన్ యాప్ ద్వారానే కొనసాగుతుండడాన్ని పోలీసులు పసిగట్టారు. అధికారిక అనుమతులు లేకుండా కొనసాగుతున్న దందాపై పోలీసులు నజర్ పెట్టారు. మొదట ముఖ్యమైన నిర్వాహకులను పట్టుకుని వారిపై పలురకాల కేసులు నమోదు చేశారు. అయితే ఇందులో అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్న వారికి ఇప్పటివరకు బేయిలు లభించకపోతుండడం కేసు తీవ్రతను వెల్లడిస్తున్నది.

జిల్లాలో 60 మందికిపైగా నిర్వాహకులు

జిల్లాలో దాదాపు 60 మందికిపైగా నిర్వాహకులు ఉన్నట్లు పోలీసులు తమ విచారణలో తేల్చారు. దీంతో నిర్వాహకులను దశలవారీగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పెట్టిన పెట్టుబడికి వచ్చే కమీషన్‌ను కేవలం ఆన్‌లైన్ యాప్ ఖాతాలోనే చూపుతూ మోసాలకు పాల్పడుతున్నారు. పాన్, ఆధార్, బ్యాంకు ఖాతాతో ప్రమేయం లేకుండానే అల్లావుద్దీన్ అత్భుతదీపం మాదిరిగా సెల్‌ఫోన్ యాప్‌లోనే కమీషన్ డబ్బులు, లాభాలు, ఇతర ప్రయోజనాలను చూపుతూ బురిడీ కొట్టిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎస్పీ జానకి షర్మిల మరోసారి ఈ దందాపై కొరడా దృష్టిసారించారు. తాజాగా మంగళవారం తెల్లవారు జామున ప్రత్యేక పోలీసు సిబ్బంది స్టార్ హోల్డర్లను అదుపులోకి తీసుకోవడం జిల్లా అంతటా మరోసారి కలకలం రేపుతున్నది. మొదట బోథ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని విచారించి కడెం, ఖానాపూర్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది ఉపాధ్యాయులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరందరినీ నిర్మల్‌లో కాకుండా ఇతర పోలీస్ స్టేషన్‌లో రహస్యంగా విచారణ జరుపుతున్నట్లు తెలుస్తున్నది. కాగా.. వీరిని అరెస్టు చేసిన తర్వాత నిర్వాహకులను కూడా అదుపులోకి తీసుకునే అవకాశాలున్నట్లు చెబుతున్నారు.

పోలీసుల అదుపులో ఉపాధ్యాయుడు

బోథ్, సెప్టెంబర్ 24 : నిర్మల్ జిల్లాలో వెలుగు చూసిన బిట్ కాయిన్ కేసుకు సంబంధించి బోథ్ మండలంలోని సొనాల గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయుడిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం గ్రామానికి వచ్చిన పోలీసులు మొదట వారి ఇంటి తలుపు తట్టారు. తెరవకపోవడంతో అనౌన్స్‌మెంట్ ద్వారా తలుపు తెరవకుంటే బద్దలు కొట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎట్టకేలకు ఇంటి తలుపులు తెరవడంతో ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం నిర్మల్ జిల్లాకు తీసుకెళ్లారు. ఒకటి, రెండు రోజుల్లో మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లుగా సమాచారం.

కూలింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న మేనేజర్ దుస్రు నాయక్

రెండు రోజుల్లో డబ్బులు జమ చేస్తాం

ఇచ్చోడ, సెప్టెంబర్ 24 : విజయ డెయిరీ బిల్లులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ సోమవారం పాడి రైతులు మండల కేంద్రంలోని రోడ్డుపై పాలు పారబోసి నిరసన తెలిపిన విషయం విధితమే. స్పందించిన విజయ డెయిరీ జిల్లా మేనేజర్ దుస్రు నాయక్ మంగళవారం బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు నాలుగు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇచ్చోడ కేంద్రంలోని రైతులకు రూ.6 లక్షల బిల్లులు చెల్లించాలి. రెండు బిల్లులు విడుదలయ్యాయి. రైతుల ఖాతాల్లో రెండో రోజుల్లో డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. కమిషన్ ఏజెంట్ బిల్లులు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలో అవి కూడా జమ చేస్తామన్నారు. అనంతరం బోరిగామలో పాల కేంద్రం ఏర్పాటు కోసం భవనాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోరిగామ పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, సెప్టెంబర్ 24 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుంకిడి మార్కెట్ యార్డు నిర్మాణానికి భూమి కేటాయించి అన్ని ప్రక్రియ పూర్తి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్డర్ ఇవ్వడానికి ఎం ఇబ్బందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో గ్యారంటీలు అమలు చేస్తామని దేవుళ్లపై ఒట్టు వేసి రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి పాపాన్ని కొనితెచ్చారన్నారు. ఈ ప్రభుత్వం పాడి పరిశ్రమను భ్రష్టు పట్టించిందన్నారు. ఇచ్చోడ మండలకేంద్రంలో ఇటీవలే పాల బిల్లులు రాక పాడి రైతులు రోడ్డుపై పాలు పారబోసి ధర్నా చేశారన్నారు. రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు రైతుభరోసా డబ్బులు జమ కాలేదన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు ప్రజలు పక్షాన ఉండి పోరాడుతామన్నారు. ఈ సమావేశంలో అధికార ప్రతినిధి కిరణ్, మండల కన్వీనర్ తోట వెంకటేశ్, అభిరాం రెడ్డి, అబ్దుల్, ప్రకాశ్, ఆశన్న, తోట శ్రీనివాస్, ప్రకాశ్, రవి, రవికాంత్, దేవ్‌రావ్, మహేశ్, దేశ్‌ముఖ్, నవీన్ రెడ్డి, గంగాధర్, సుదర్శన్ రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, కేదారేశ్వర్ రెడ్డి, రమాకాంత్, మాజీ ఎంపీటీసీ రఘు, అరుణ్, లక్ష్మికాంత్‌పాల్గొన్నారు.

ఇంటింటికీ భగీరథ నీరు

ఎనిమిల్ కేర్ సెంటర్ ను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

శిక్షణలో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : ప్రభుత్వం మిషన్ భగీరథ నీటిని ఇంటింటికీ సరఫరా చేస్తున్నదని, ప్రతి ఒక్కరు భగీరథ నీటిని తాగేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేయగా.. కలెక్టర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ సిబ్బందికి అవగాహన కల్పించేందుకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కలుషిత నీరు తాగడం వల్ల అనారోగ్యం బారినపడుతున్నారని, ప్రతి ఒక్కరు భగీరథ నీరు తాగేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ సురేశ్, ఎంపీడీవో పాల్గొన్నారు.

ఎనిమల్ కేర్ సెంటర్ పరిశీలన

ఆదిలాబాద్‌లోని ఎనిమల్ కేర్ సెంటర్‌ను కలెక్టర్ రాజర్షి షా మంగళవారం సందర్శించారు. రోజువారి కార్యక్రమ వివరాలు, రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రదర్శనను తిలకిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

శాస్త్ర, సాంకేతిక రంగాలపై దృష్టి సారించాలి

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 24 : విద్యార్థులు చదువుతోపాటు శాస్త్ర, సాంకేతిక రంగాలపై దృష్టిసారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం జిల్లాస్థాయి యువజన ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సోఫీనగర్ గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్‌ఫేయిర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు. సైన్స్ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతనం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీధర్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డానియల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో స్పోర్ట్స్ బోర్డు సమావేశం

స్పోర్ట్స్ మీటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

బాసర, సెప్టెంబర్ 24 : ఆర్జీయూకేటీ బాసరలో మంగళవారం స్పోర్ట్స్ బోర్డు మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్‌గా వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అధ్యక్షతన వహించారు. క్రీడారంగ నిపుణుల బృందంతో బాలమణి, బీఆర్ నేత, అనితలు హాజరై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కన్వీనర్ ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్ శ్యాంబాబు, రవికిరణ్, రఘువీర్, వసంత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.